సేవకులం.. నాయకులం..

- నాయకత్వ లక్షణాల వృద్ధితోనే నర్సింగ్ భవిత
- నర్సింగ్ 78వ టీఎన్ఏఐ ద్వై వార్షిక సమావేశంలో ప్రముఖులు
- పాల్గొన్న 2500 మంది నర్సింగ్ విద్యార్థినులు


సదస్సులో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులు, ఫ్యాకల్టీలు


జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు, వక్తలు

కాకినాడ క్రైం: జీతాలే కావాలంటే ఎన్నో ఉద్యోగాలున్నాయి. సంపాదనే లక్ష్యమైతే ఇంకెన్నో మార్గాలున్నాయి. వీటికి అతీతంగా సేవలో తరించాలనుకునే సహృదయాలే నర్సింగ్ ఉద్యోగాన్ని ఎంచుకుంటాయి. అటువంటి మహోన్నత వృత్తిలో రోగులకు సేవలందించడంలో నర్సులు అంకిత భావంతో పనిచేస్తున్నారు. అయితే సేవకులం మాత్రమే కాదు, నాయకులం కూడా అని వారు రుజువు చేసుకోవలసిన సమయం ఆసన్నమైంది. తద్వారా నర్సింగ్ సేవల నాణ్యత మరింత వృద్ధి చెందాల్సి ఉంది. పేద రోగులకు మనమున్నామనే భరోసా పెరగాలి, యావత్ వైద్య రంగానికే నర్సింగ్‌ను తలమానికం కావాలి. ఇవి జరగాలంటే నర్సింగ్ రంగంలో నాయకత్వ లక్షణాలు ఉండాలని కాకినాడలోని శనివారం జరిగిన 78వ టీఎన్ఏఐ ద్వైవార్షిక సమావేశంలో నర్సింగ్ రంగంలో ఉద్దండుల వ్యాఖ్యానించారు.

కాన్ఫరెన్స్ సూపర్ సక్సెస్

శనివారం జరిగిన 78వ టీఎన్ఏఐ(ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆంధ్రప్రదేశ్ శాఖ ద్వైవార్షిక సమావేశం సూపర్ సక్సెస్ అయింది. రాష్ట్ర వ్యాప్తంగా 2500 మంది నర్సింగ్ విద్యార్థులు ఈ సమావేశానికి హాజరయ్యారు. టీఎన్ఏఐ ఏపీ బ్రాంచ్ ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షురాలు సీఆర్ సంషీర్‌బేగం, కార్యదర్శి, ఏపీఎస్ఎంసీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కే.సుశీలల అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఏపీ డీఎంఈ, డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, అతిథిగా ఇండియన్ రిసక్సియేషన్ కౌన్సిల్ వ్యవస్థాపకుడు విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ చక్రరావు పాల్గొన్నారు.

నేర్చుకుంటే నాయకులే..

ప్రతి నర్సింగ్ విద్యార్థినిని నాయకురాలిగా తీర్చిదిద్దడం ద్వారా నర్సింగ్ రంగ భవితను బంగారుమయం చేయవచ్చని డాక్టర్ నరసింహం అన్నారు. అందుకు విశేష కృషి అవసరమన్నారు. బోధకులు, తల్లిదండ్రులు ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నర్సింగ్ రంగంలో చోటు చేసుకుంటున్న సానుకూల మార్పులను అధ్యయనం చేయాలన్నారు. నిరంతరం నేర్చుకోవడమే నాయకత్వపు అసలు రహస్యమని డాక్టర్ నరసింహం వివరించారు. మేల్ నర్సులకు రానురాను ప్రాధాన్యత పెరుగుతోంది. నర్సింగ్ రంగ భవిత దేదీమానంగా వెలగనుంది. సాంకేతికత ఎంతగా అందుబాటులోకి వచ్చినా నర్సులందించే సేవలకు ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదన్నారు. రోగి సంరక్షణలో నిరంతరాయంగా శ్రమించేది నర్సులేనని కితాబిచ్చారు. అనంతరం డాక్టర్ చక్రరావు మాట్లాడుతూ, కార్డియో పల్మనరీ రిసక్సియేషన్(సీపీఆర్)లోని బీఎల్ఎస్‌ను నర్సింగ్ విద్యలో తప్పనిసరి చేయడం శుభసూచకం అన్నారు. అత్యవసర వేళల్లో నర్సే రోగి పాలిట ప్రాణాం పోసే భగవంతుడు కాగలదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నాయకత్వ పటిమను పెంపొందించుకోవడం వల్ల ఆదర్శవంతులుగా కీర్తించబడతాయని డాక్టర్ చక్రరావు అన్నారు. సదస్సులో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సదస్సు ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళలను ఆకట్టుకునే చీరలు, వన్‌గ్రాం గోల్డ్ ఐటమ్స్ ప్రదర్శన, బూత్ సెల్ఫీ, రోటేటింగ్ వీడియో, మెహందీ ఆకర్షించాయి. విరామ వేళల్లో నర్సింగ్ విద్యార్థులు అక్కడికి పోటెత్తారు. పేపర్ ప్రజంటేషన్ల ద్వారా నర్సింగ్ ఉన్నతిని, నాయకత్వ లక్షణాల ఆవశ్యకతను వివరించారు. ఒక్కరోజు సదస్సు శనివారం రాత్రితో ముగిసింది. సదస్సుకు ఏపీడీఎంఈ నర్సింగ్ డీడీ ఎస్.జ్యోతి, శ్రీకాకుళం జెమ్స్ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.పద్మావతి, కె.ఝాన్సీలక్ష్మీబాయి, డి.ఉషా పన్నగవేణి, ఎం.మాధవి, సీబా ఫ్రాన్సిస్, ఎం,సత్యవల్లి తదితరులు హాజరయ్యారు.

నర్సింగ్ వృత్తి మంచి భవిత



78వ టీఎన్ఏఐ సదస్సు నర్సింగ్ భవితకు, నర్సుల భవిష్యత్‌కు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుంది. నర్సింగ్ రంగాన్ని ఇంకే రంగానికీ తీసుపోని చెప్పడానికి నాయకత్వ లక్షణాలు ఎంతో ఆవశ్యం. ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి.

– జి.గౌతమి, ప్రిన్సిపాల్, సత్యం కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ధవళేశ్వరం

సదస్సు విజయవంతం



టీఎన్ఏఐ ఆంధ్రప్రదేశ్ శాఖ, కాకినాడ ఆర్ఎంసీ నర్సింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సంఘ అధ్యక్ష కార్యదర్శులు సంషీర్‌బేగం, సుశీలల ప్రత్యక్ష పర్యవేక్షణలో సదస్సు విజయవంతమైంది. రాష్ట్రస్థాయి సదస్సుకు కాకినాడ వేదిక కావడం సంతోషంగా ఉంది.

– డాక్టర్ మాగం మునిరత్నమ్మ, ప్రిన్సిపాల్, నర్సింగ్ కాలేజ్, ఆర్ఎంసీ, కాకినాడ

గర్వపడుతున్నా..



నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్నందుకు గర్వంగా ఉంది. పేద కుటుంబ నేపథ్యం వల్ల నర్సింగ్ ఎంచుకున్నా. కానీ సదస్సుకు హాజరైన తర్వాత నేను ఎంచుకున్న రంగంపై గౌరవం పెరిగింది. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు కృషి చేస్తా.

– పడాల శ్రీ దుర్గ శిరీష, బీఎస్సీ 3వ సంవత్సరం, ఎస్‌వీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, కాకినాడ

కొత్త విషయాలు తెలుసుకున్నా



సదస్సుకు హాజరై ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్న నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆవశ్యకతను గుర్తించాను. ఈ సమావేశంలో నేను చదువుతున్న నర్సింగ్ విద్య గొప్పతనాన్ని తెలుసుకున్నా.

– స్వప్నూర్ ఖాన్, బీఎస్సీ నర్సింగ్ 3వ సంవత్సరం, ఆదిత్య నర్సింగ్ కళాశాల పశ్చిమ బెంగాల్ విద్యార్థిని

క్లుప్తంగా

కోనేరులో నీరు లేక భక్తుల ఇబ్బందులు


శివాలయం కోనేరులో అడుగంటిన నీరు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని భవానీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం(శివాలయం)లోని కోనేరులో నీరు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కార్తిక మాసంలో మహిళలు కోనేరులో దీపాలు వదులుతారు. పుణ్య స్నానాలు కూడా చేస్తారు. అయితే చేపల పట్టుకునేందుకు గాను కోనేరులో నీటిని వదిలివేయడంతో నీరు అడుగంటింది. వెంటనే నీటిని నింపాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో కార్తిక మాసం సందర్భంగా కోనేరులో వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు. వెంటనే నీటిని నింపాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి


ట్రాఫిక్ నియమాలు వివరిస్తున్న డీఎస్పీ రఘువీర్‌విష్ణు

బాలాజీచెరువు: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక నియామాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తే గమ్యానికి సురక్షితంగా చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని, ముఖ్యంగా డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ వాడకూడదని సూచించారు. సైబర్ క్రైమ్, సైబర్ బుల్లింగ్‌కు సంబంధించి ప్రజలు అనుమానాస్పద లింక్‌లు తెరవకూడదన్నారు. అనంతరం విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రమాదాల బారి నుంచి సురక్షితంగా ఎలా బయటపడాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు రామారావు, ఎన్.రమేష్, ఎస్ఐ వెంకటరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం నగర మహాసభ

కాకినాడ సిటీ: సీపీఎం కాకినాడ నగర మహాసభ (త్రైవార్షిక విస్తృత సమావేశం) ఆదివారం ఉదయం 10 గంటలకు కాకినాడ అన్నదాన సమాజంలో నిర్వహిస్తున్నట్టు సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎం దేశ రాజకీయాల్లో విశిష్ట స్థానం కలిగి ఉందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి శాఖ స్థాయి నుంచి అఖిల భారత స్థాయి వరకు ప్రజా ఉద్యమాలను, పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోవడానికి మహాసభలు జరుగుతూ ఉంటాయన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జీ, జి.బేబీరాణి తదితరులు పై కమిటీ నుంచి పరిశీలకులుగా హాజరవుతారన్నారు. నగర పరిధిలోని వివిధ శాఖలో ఉన్న సభ్యులందరూ ప్రతినిధులుగా హాజరవుతారని వీరబాబు తెలిపారు. సమావేశంలో కాకినాడ నగరంలో సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. భవిష్యత్తు ఉద్యమాలకు రూపకల్పన చేసుకుంటామని తెలిపారు.

19న మహా రుద్రాభిషేకాలు


వివరాలను వెల్లడిస్తున్న బ్రాహ్మణ సమాఖ్య వ్యవస్థాపకులు పసుమర్తి సత్యనారాయణ

బోట్‌క్లబ్: కార్తిక మాసం సందర్భంగా స్థానిక పాత గైగోలుపాడులో ఉన్న షిరిడి సాయిబాబా ధ్యాన మందిర కమిటీ, బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన బాబా మందిరంలో మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నారు. సమాఖ్య వ్యవస్థాపకులు పసుమర్తి సత్యనారాయణ, మందిర కమిటీ ప్రతినిధి మేకా లక్ష్మణమూర్తి శనివారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 19న ఉదయం 8 గంటలకు మండపారాధన, పార్థివ శివలింగానికి మహా రుద్రాభిషేకం, అనంతరం రుద్ర హోమం, అనంతరం ముత్తైదువులతో సామూహిక కుంకుమార్చాన, పూజలు జరుగుతాయన్నారు. మేకా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఈ ధ్యానమందిరం అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పొద్దుటూరు బాలాజీ విశ్వనాథ శర్మ, కోశాధికారి కప్పగంతుల సాయిరామ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు యాతగిరి పరశురామ్ పాల్గొన్నారు.

సమీక్ష పేరిట కూటమి నాయకుల అధికార దర్పం


కాపు కల్యాణ మండపంలో మండల అధికారుల సమాశపు వేదికపై ఎమ్మెల్యే పంతం నానాజీ. చిత్రంలో వేదికపై కూటమి నాయకులు

కాకినాడ రూరల్: మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో ఎమ్మెల్యే పంతం నానాజీ శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం కూటమి నాయకుల అధికార దర్పం ప్రదర్శనకు వేదికగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాఖల వారీగా అభివృద్ధిపై సమీక్షించేందుకు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితరులను ఆహ్వానించారు. ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే నానాజీ అధికారులతో సమీక్షలు పరిపాటే. కానీ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశపు వేదికపై మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావుతో పాటు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు ఆశీనులయ్యారు. వారి సమక్షంలో అధికారులు తమ శాఖ వివరాలు నివేదించేందుకు ఇబ్బంది పడ్డారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: వాకలపూడి సెక్షన్ పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ట్రాన్స్ కో కాకినాడ డివిజన్ ఈఈ ఉదయ భాస్కర్ తెలియజేశారు. ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 33/11 కేవీ తిమ్మాపురం విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ వాకలపూడి ఫీడర్ పరిధిలోని అచ్చంపేట జంక్షన్, మారుతినగర్, అవంతినగర్, కొత్తూరు జంక్షన్, కిరణ్ ఆస్పత్రి ఏరియాలో సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

గడువు లోగా గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి


కరపలో ఓటర్ నమోదుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కరప: మండల పరిధిలోని గ్రాడ్యుయేట్లు అందరూ ఓటరుగా తమ పేరును ఈనెల 6వ తేదీలోగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వీఆర్వోలు తదితర శాఖల ఉద్యోగులతో సమావేశమై గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించారు. 2021 సంవత్సరం అక్టోబరు 31వ తేదీలోగా డిగ్రీ పూర్తి చేసిన వారందరూ విధిగా ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ ప్రూఫ్, ఆధార్‌కార్డు జెరాక్స్‌లతో పాటు పాస్‌పోర్టు ఫొటో దరఖాస్తుకు జత చేసి, ఎంపీడీఓ కార్యాయలంలో అందజేయాలన్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకున్నవారు కూడా మళ్లీ నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ అనుపమ సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తహసీల్దార్ సత్యనారాయణ కోరారు. ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏఓ బీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

గణపతి పీఠంలో పంచామృతాభిషేకం

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావు పేట దూసర్లపూడి వారి వీధిలోని స్వయంభూ భోగి గణపతి పీఠంలో శనివారం సుప్రభాత వేళలో శ్రీవారి 57వ జప యజ్ఞ పారాయణ సందర్భంగా శివ కేశవులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ కార్తిక మాసంలో శివ కేశవుల ఆరాధన చేయడం ముక్తి ప్రదాయకమైన మోక్ష మార్గమన్నారు. శ్రీవారి పాదాల వద్ద బియ్యపుపిండి బెల్లం అరటిపండు గుజ్జుతో తయారు చేసిన 7 ప్రమిదలలో 7 వారాలు ఆవు నెయ్యితో దీపారాధన చేస్తే దోషాలు తొలగి, ముక్తి లభిస్తుందన్నారు. పదేళ్ల వయసు బాలురతో 9న గోవింద నామాల బాలదాసులతో శ్రీవారి 58వ సహస్రనామ పారాయణ జరుగుతుందన్నారు.


గణపతి పీఠంలో శ్రీవారి జపయజ్ఞ పారాయణలో పాల్గొన్న భక్తులు

సచివాలయ వలంటీర్ల ధర్నా


కాకినాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు

కాకినాడ రూరల్: సమస్యలు పరిష్కారం కోరుతూ ఏపీ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్ వద్ద తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా శనివారం వలంటీర్ల ధర్నా నిర్వహించారు. ఐదు నెలలు పెండింగ్ వేతనాలు అందించాలని, విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ నాయకులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు రాజా మాట్లాడుతూ ఎన్నికల ముందు వలంటీర్లను రాజీనామా చేయవద్దని తాము అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లను కొనసాగిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వేతనం రూ.10వేలు చేస్తామని చెప్పారని అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడం లేదన్నారు. నవంబరు 6న జరగనున్న క్యాబినెట్ సమావేశంలో వలంటీర్ల సమస్య పరిష్కారం కోసం నిర్ణయం తీసుకోపోతే ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో మేడిశెట్టి వెంకటరమణ, దుర్గా ప్రసాద్, శ్రీహరి, గంగాభవాని, బొంతు సంధ్యాదేవి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక మాసం పూజలు


కరప శివాలయంలో రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కరప: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మహిళలు కార్తిక మాసం పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విష్ణు, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తిక మాసం ప్రారంభం కావడంతో మహిళలు వేకువజామునే లేచి కాలువలు, చెరువుల వద్దకు వెళ్లి పుణ్యస్నానమాచరించి పాడ్యమి దీపాలు వదిలారు. కరప, నడకుదురు, గురజనాపల్లి, వేములవాడ, పెద్దాపురప్పాడు, పెనుగుదురు, చినమామిడాడ, గొర్రిపూడి, కొరిపల్లి, అరట్లకట్ట, వేళంగి, వాకాడ, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. స్థానిక శివాలయంలో ప్రధాన అర్చకులు విలపర్తి శ్రీనివాస్ పర్వతవర్ధనీదేవి సమేత రామలింగేశ్వరస్వామికి, విష్ణాలయంలో ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి విశేష పూజలు చేశారు. శివాలయాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులతో సందడి నెలకొంది. సాయంత్రం కరప శివాలయంలో అర్చకులు శ్రీనివాస్ ఆకాదీపాన్ని ప్రారంభించారు. ఈఓ కె.తిరుమలరవితేజ భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కరపలోని స్నాన ఘట్టంవద్ద భక్తులు స్నానమాచరించి, పూజలు చేసుకునేందుకు సర్పంచ్ సాదే ఆశాజ్యోతి శుభ్రం చేయించి, ఏర్పాట్లు చేశారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి అర్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు ప్రత్యేకపూజలు చేశారు.


యండమూరులో ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: కార్తికమాసంలో తొలిరోజు శనివారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు తాకిడి దృష్టిలో ఉంచుకొని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి కార్తిక్ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక భానులింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనం కోసం క్యూలు కట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రసాద్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. 5వ డివిజన్ మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత, సాయిబాబా దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక రామారావుపేటలోని శివాలయంలో భక్తులు దర్శనం కోసం క్యూలు కట్టారు. జగన్నాథపురం, సాంబమూర్తినగర్‌లోని శివాలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి.


భానులింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు


దేవాలయంవీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

పోలీసు లాంఛనాలతో హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎం.రామచంద్రరావు అంత్యక్రియలను పోలీసు లాంఛనాలతో శనివారం నిర్వహించారు. పోలీసు స్టేషన్ నుంచి శుక్రవారం రాత్రి 9.30 గంటలకు ఇంటికి బైక్‌పై బయలు దేరిన రామచంద్రరావును వెనక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతదేహానికి శనివారం ఉదయం జీజీహెచ్‌లో పీఎం నిర్వహించారు. అనంతరం రమణయ్యపేట జనచైతన్య నగర్‌లో నివాసానికి భౌతికకాయాన్ని తీసుకువచ్చారు. అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, సర్పవరం పోలీసు సిబ్బంది రామచంద్రరావు భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం రమణయ్యపేట మార్కెట్ వద్ద శ్మశాన వాటికలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. రామచంద్రరావు కుటుంబానికి అండగా ఉంటామని పోలీసు అధికారులు ధైర్యం ఓదార్చారు.

ఎస్‌జీఎఫ్ఐ క్రీడాకారుల ఎంపిక


రోల్‌బాల్ విభాగంలో పోటీపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో అండర్–14, 17 విభాగాల్లో వివిధ క్రీడాంశాల్లో క్రీడాకారుల ఎంపికలు శనివారం కాకినాడ డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహించారు. ఈ ఎంపికలను పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి జార్జి ప్రారంభించారు. బేస్‌బాల్ అండర్–14, 17, మోడ్రన్ పెంటథలాన్ అండర్–17, జిమ్నాస్టిక్స్ అండర్–14, 17, రోల్‌బాల్ ఎంపికలకు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరి నుంచి ప్రతిభ చూపిన క్రీడాకారుల నుంచి జిల్లా జట్లను నిర్వాహకులు ఎంపిక చేశారు. ఈ ఎంపికల్లో సునీల్, బీవీ ప్రసాద్, కార్ ఈశ్వరరావు, జీజేఆర్ఎస్ కార్, నీలిమ, మాలిని పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుల ఎంపిక


కబడ్డీ క్రీడాకారిణులకు టీ-షర్టులు అందిస్తున్న కర్రి భామిరెడ్డి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అంతర్ కళాశాల కబడ్డీ పోటీల ఎంపికలు శనివారం పీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగాయి. ఈ ఎంపికలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తి రుపాణ్యం ప్రారంభించారు. ఎంపికల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు హరిష్ స్పోర్ట్స్ నిర్వాహకులు టి.హరీష్ టీ-షర్టులు బహుకరించారు. కళాశాల పూర్వవిద్యార్థుల సంఘ ప్రతినిధి కర్రిభామిరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని ఎంపికలు ప్రారంభించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ పరిశీలకులు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.